47)కేదారగౌళ

ప॥ అడుగరే యాతనినే అంగనలాలా । గుడిగొని తానే వట్టి గొరబాయగాక ॥

చ॥ యెదురాడేదాననా యెంతటి పనికినైనా । పదరి తానే మారువలికీ గాక ।
తుదమీఱేదాననా దూరైయంత దిరిగినా । ముదమునదానే మారుమలసీగాక ॥

చ॥ కక్కసించే దాననా కడలెంత దొక్కినాను । వెక్కసీడై తానై యిటు వెలసీగాక ।
మొక్కలపుదాననా ముందు వెనకెంచితేను । పక్కనె దానె ముంచి పంతమాడీగాక ॥

చ॥ తడబడేదాననా తనరతి వేళను । బడిబడి దానే చొక్కి భ్రమసీగాక ।
అడిగేటి దాననా అందరిలో నన్నుగూడి । అడరి శ్రీవేంకటేశు డాదరించీగాక ॥